జ్వరాల సర్వే పకడ్బందీగా నిర్వహించండి

మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య

పెడన: పట్టణంలో జ్వరాల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య సూచించారు. పట్టణంలో విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటింటి సర్వే చేసి వారు ఆయా బాధితులు ఆసుపత్రులో చూపించుకుంటున్నదీ లేనిదీ ఆరా తీసి నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అన్నారు. శనివారం ఉదయం ఆయన పట్టణంలోని ఏడో సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి కమిషనర్ దిశానిర్దేశం చేశారు. ఇంటింటి సర్వే చేసే సమయంలో ఆ ఇంటిలో జ్వర బాధితులు ఎవరైనా ఉన్నారా.. ఉంటే వారి పేరు, వయస్సు తెలుసుకుని, ఎన్ని రోజులు నుంచి జ్వరం ఉంటుంది, ఎక్కడ చూపించారనే వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. వైద్యం చేయించుకోకపోతే తక్షణం వారికి వైద్య సేవలను అందించేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే ఆ ఇంటి పరిసరాలను కూడా క్షుణ్ణంగా పరిశీలించి నిల్వ నీరు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి సచివాలయ పరిధిలో శానిటరీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మహిళా పోలీసులు, సచివాలయాల్లో విధులు నిర్వహించే అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సహాయం కూడా తీసుకోవాలని సూచించారు. జ్వరాలు అధికంగా ఉన్న ప్రాంతంలో పట్టణ అర్బన్ హెల్త్ సెంటరు ద్వారా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయించాలన్నారు. ఉచితంగా మందులు ఇప్పించేలా చర్యలు తీసుకుందామని, తప్పనిసరిగా సర్వే చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు.



ఏడో సచివాలయం సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న కమిషనర్ వెంకటరామయ్య

20 నుంచి ఆధార్ శిబిరాలు



ఘంటసాల ఎంపీడీవో అనూహ్య

ఘంటసాల: ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో టి.అనూహ్య కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలో ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. 20న శ్రీకాకుళం పంచాయతీ కార్యాలయం వద్ద, 21న తెలుగురావుపాలెం పంచాయతీ వద్ద తెలుగురావుపాలెం, అచ్చెంపాలెం గ్రామస్తులకు, చిట్టూర్పు పంచాయతీ వద్ద చిట్టూర్పు, దేవరకోట, దాలిపర్రు గ్రామస్తులకు, 22న చినకళ్లేపల్లి పంచాయతీ వద్ద చినకళ్లేపల్లి, వేములపల్లి, కొడాలి గ్రామస్తులకు, ఘంటసాలపాలెం పంచాయతీ వద్ద ఘంటసాలపాలెం, కొత్తపల్లి, తాడేపల్లి గ్రామస్తులకు, 23న పాపవినాశనం పంచాయతీ వద్ద పాపవినాశనం, గోగినేనిపాలెం గ్రామస్తులకు, యండకుదురు పంచాయతీ వద్ద యండకుదురు, పూషడం, మల్లాయి చిట్టూరు, లంకపల్లి గ్రామస్తులకు, 24న మల్లంపల్లి పంచాయతీ వద్ద మల్లంపల్లి, వి.రుద్రవరం, చిలకలపూడి గ్రామస్తులకు, ఘంటసాల పంచాయతీ వద్ద ఘంటసాల–1, ఘంటసాల–2 సచివాలయం పరిధిలోని ప్రజలకు ఆధార్ సేవలు ఉంటాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ క్యాంపులు అందుబాటులో ఉంటాయన్నారు.

వయనాడ్ బాధితులకు రూ.3 లక్షల విరాళం

మచిలీపట్నంటౌన్: నగరంలోని స్టార్ కాలేజ్, సన్ స్టార్ స్కూల్ ఆధ్వర్యంలో రూ.3 లక్షల విరాళాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ద్వారా శనివారం అందజేశారు. ప్రకృతి విలయంతో కేరళలోని వయనాడ్‌లో బాధితులను ఆదుకునేందుకు సిరి పబ్లికేషన్స్ అధినేత, స్టార్ విద్యాసంస్థల అకడమిక్ మెంటర్ శ్రీరామ్ వ్యక్తిగతంగా రూ.50 వేల చెక్కును విద్యార్థుల సమక్షంలో కలెక్టర్ బాలాజీకి అందజేశారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులు రూ.2.50 లక్షలను మానవతా స్వచ్ఛంద సంస్థకు అందజేసేందుకు సేకరించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదుగా మానవతా సంస్థ అధ్యక్షుడు శ్రీరామ్, కోచైర్మన్ ముదిగొండ శాస్త్రిలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టార్ విద్యాసంస్థల డైరెక్టర్ బి.అయ్యప్పస్వామి, స్టార్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంఎల్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ డీకే బాలాజీకి చెక్కు అందజేస్తున్న శ్రీరామ్, విద్యార్థులు

ఆక్వా రైతుల సాగునీటి కష్టాలు

కృత్తివెన్ను: భారీగా వర్షాలు పడ్డాయి.. నదులు పొంగిపొర్లాయి.. ఇక సాగు నీటికి కొరత లేదనుకున్న రైతులకు నిరాశ మిగిలింది. తీరప్రాంతమైన మండలంలో ప్రస్తుతం ఖరీఫ్ సాగుచేస్తున్న పొలాలకు సాగునీటి కొరత వెంటాడుతోంది. ప్రధాన పంటకాలువకు చేరువలో వారు మాత్రం కాలువలో నీటిని ఆయిల్ ఇంజిన్లతో తోడుకుంటున్నారు. శివారు రైతులకు కన్నీటి కష్టాలే మిగులుతున్నాయి. ప్రదాన పంటకాలువలో నీటి మట్టం పెంచేందుకు అధికారులు సాగునీటి పైపులన్నీ మూసేస్తున్నారు. దీంతో ఆక్వారైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరిచేలతో పాటు తమ వద్ద కూడా శిస్తులు వసూలు చేస్తూ నీటి సరఫరాలో మాత్రం తమపై నిర్లక్ష్య ధోరణి చూపడం దారుణమని ఆక్వా రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పంట కాలువలకు పుష్కలంగా నీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నించగా త్వరలో నీటి సరఫరా పెరుగుతుందన్నారు.



యండపల్లి వద్ద పంటకాలువ నుంచి ఆయిల్ ఇంజిన్‌తో నీరు తోడుకుంటున్న రైతులు

ఘంటసాల కళాపీఠం గౌరవాధ్యక్షుడిగా మనోహర్

పామర్రు: పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం గౌరవాధ్యక్షుడిగా ఐవీఎస్ మనోహర్‌ను ఎంపిక చేసినట్లు కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ అన్నారు. స్థానిక హితమ్ స్కూల్లో కళాపీఠం సభ్యులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కళాపీఠం గౌరవాధ్యక్షుడిగా ఐవీఎస్ మనోహర్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ కళా పీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి సేవా కార్యక్రమంలో మనోహర్ పాల్గొని తన సేవలను పీఠానికి అందజేశారన్నారు. ఈ సేవలను గుర్తించిన పీఠం మనోహర్‌కు గౌరవాధ్యక్ష పదవి ఇచ్చి గౌరవించినట్లు పేర్కొన్నారు. పామర్రులోని అన్న క్యాంటిన్‌కు మనోహర్ రూ.25 వేల సాయం అందజేశారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తుగా మనోహర్ దంపతులను సన్మానించామన్నారు. కార్యక్రమంలో కళా పీఠం కార్యదర్శి హేమంత్‌రెడ్డి, సభ్యులు పరిశ వెంకట నాంచారయ్య, రాజబాబు పాల్గొన్నారు.



ఐవీఎస్ మనోహర్ దంపతులను సన్మానిస్తున్న కళాపీఠం అధ్యక్షుడు మురళీకృష్ణ

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

డీఎస్పీ శ్రీనివాసరావు

ఉంగుటూరు: పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం చేయాలని గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు ఎస్‌ఐలకు సూచించారు. ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో హనుమాన్‌జంక్షన్ సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలకు నేర సమీక్ష సమావేశాన్ని శనివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు ఎస్‌ఐలకు పలు సూచనలు చేశారు. స్టేషన్‌లో రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని చెప్పారు. చెడు నడత గలవారిపై నిఘా ఉంచి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దొంగతనాలు జరగకుండా ఉండేందుకు రాత్రిళ్లు గస్తీని ముమ్మరం చేయాలని చెప్పారు. పాత నేరస్తుల కదలికలను గమనించి క్రమం తప్పకుండా బైండోవర్ చేయాలని ఆదేశించారు. పేకాట, కోడిపందేలు వంటి జూదాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో హనుమాన్‌జంక్షన్ సీఐ కె.సత్యనారాయణ, హనుమాన్‌జంక్షన్, ఆత్కూరు, వీరవల్లి ఎస్‌ఐలు ఏడీఎల్ జనార్ధన్, సురేష్ చావా, ఎం.చిరంజీవి పాల్గొన్నారు.



ఆత్కూరులో ఎస్‌ఐలతో సమీక్ష నిర్వహిస్తున్న గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు

వక్ఫ్ భూముల సర్వేకు ఆదేశం

పమిడిముక్కల: ఫత్తేలంక గ్రామంలో రైతుల ఆక్రమణలో ఉన్న 32 ఎకరాల 69 సెంట్ల వక్ఫ్ భూములను సర్వే చేసేందుకు జిల్లా వక్ఫ్ బోర్డు అధికారి జి.శ్రీదేవి జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. భూముల ఆక్రమణపై తాను జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మసీదు మాన్యం భూములను వెంటనే సర్వే జరిపించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

వైభవంగా నవగ్రహ హోమాలు



బంటుమిల్లి: స్థానిక పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు శనివారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఉదయం దీక్షధారణ చేసిన దంపతులతో పండితులు పుణ్యాహవచనం, ప్రధాన మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నవగ్రహహోమాలు వైభవంగా చేశారు. రాత్రికి శాంతి హోమాలు, తీర్థ, ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.రాజ, కె.కరుణకుమార్, యూపీఆర్ విఠల్, జె. శరభయ్య గుప్త, సీహెచ్.రాధాకృష్ణ తదితర భక్తులు పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో అసోసియేషన్ నేతలు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని గెజిట్ అండ్ నాన్ గెజిట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ పురుషోత్తమ నాయుడు, జిల్లా అధ్యక్షుడు ఉన్ని కృష్ణ శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారికి అలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసి నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అవనిగడ్డ యూనిట్ అధ్యక్షుడు ఎస్.సురేష్, చల్లపల్లి యూనిట్ సుధాకర్, పెన్షనర్ల సంఘం అవనిగడ్డ యూనిట్ కార్యదర్శి అబ్దుల్ హజీజ్, కార్యదర్శులు పేర్ని మాధవేంద్రరావు, రామకోటేశ్వరావు వారికి శాలువా కప్పి సత్కరించారు.

వసతి గృహాల అభివృద్ధికి కృషి

అవనిగడ్డ: ప్రభుత్వ వసతి గృహాల అభివృద్ధికి కృషి చేస్తానని శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. ఎమ్మెల్యే తన కార్యాలయంలో శనివారం వసతి గృహాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పన, మరమ్మతులు, అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని చెప్పారు. వసతి గృహాల్లో సమస్యల గురించి జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జి.రమేష్‌తో ఆయన చర్చించారు. ఈ సమావేశంలో వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్లకు రక్షణ కల్పించాలి



గుడివాడరూరల్: డ్యూటీలో ఉన్న డాక్టర్లకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోలకతాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డ్యూటీలో ఉన్న డాక్టర్‌ను అతి కిరాతకంగా రేప్ చేసి చంపడం దారుణమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో పట్టణ ఐద్వా కార్యదర్శి పి.రజని పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



పమిడిముక్కల: వీరంకిలాకులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో అన్నపురెడ్డి అప్పన్నకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబానికి ఉయ్యూరుకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్ గుర్రాల మధుసుదనరావు రూ.10 వేల సాయం, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో వంగవీటి శ్రీనివాసప్రసాద్, దాసరి వెంకటేశ్వరరావు, శీలం రాజా పాల్గొన్నారు.

158 మందికి వైద్య పరీక్షలు



కాజ(మొవ్వ): ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో మండలంలోని కాజ గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విజయవాడకు చెందిన సీసీఆర్ఏఎస్ వైద్యనిపుణులు డాక్టర్ ఏజీవీ సాయి ప్రసాద్, కాజ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ఎం.భాగ్యలక్ష్మి 158 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరానికి గ్రామ సర్పంచ్ కొడాలి భవాని, ఉపసర్పంచ్ మంద శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ నారాయణరావు తదితరులు సహాయ సహకారాలు అందించారు.

20న వాహనాల విడిభాగాల వేలం

కోనేరుసెంటర్: కృష్ణా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలోని వివిధ రకాల వాహనాలకు మరమ్మతులు నిర్వహించిన అనంతరం తొలగించిన విడిభాగాలకు ఈ నెల 20వ తేదీన జిల్లా పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో వేలం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఏఎస్పీ ప్రసాద్ తెలిపారు. ఆసక్తి కలిగిన బిడ్డర్లు ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే బహిరంగ వేలంలో పాల్గొని అవసరమైన విడిభాగాలను పాడుకోవచ్చని తెలిపారు.

20 నుంచి ఓటరు జాబితా సవరణ

గూడూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 20 నుంచి ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి వెల్లడించారు. శనివారం స్థానిక కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబరు 18 వరకు ఓటరు జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు కొత్తగా ఓటు హక్కు కల్పించడం, ఓటరు జాబితాల్లో తప్పులు సరిదిద్దటం, చనిపోయిన వారి వివరాలను జాబితలో నుంచి తొలగింపులు చేయాల్సి ఉందన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో డీటీ వై.శివశంకర్, వివిధ గ్రామాల వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నికర ఆదాయం పెంచుకోవాలి

శ్రీకాకుళం(ఘంటసాల): రైతుల నికర ఆదాయాన్ని పెంచేందుకు దిశానిర్దేశం చేయడానికి పొలంబడి కార్యక్రమం చక్కటి వేదిక అని ఎంఏవో కె.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని శ్రీకాకుళం గ్రామంలో పొలంబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు, సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, వీపీఏ జి.దయానా, సుగ్గున పవన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

మచిలీపట్నంటౌన్: ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిల్లా కన్వీనర్ చలమలశెట్టి రమేష్‌బాబు ఆధ్వర్యంలో చిలకలపూడిలోని అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో నిర్వహించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. సంఘ నాయకులు వి.నాగేశ్వరరావు, పి.అశోక్‌కుమార్, శ్రీనివాసరావు, కిషోర్‌బాబు, ప్రకాశరావు, సుబ్రహ్మణ్యం, లాజర్, నాగరాజు, రామకృష్ణ, కౌసర్, శశి, షరీఫ్, జాషువా, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

గుడివాడరూరల్: మహిళలు, చిన్నారులపై నేరాలు జరగకుండా గ్రామాల్లో మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు సూచించారు. గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్‌లో మండలంలోని మహిళా పోలీసులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లోని ఎక్కడైనా మహిళలు, చిన్నారుల పట్ల దాడులు జరిగినా, వేధింపులకు గురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం చాలా చోట్ల సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు



వాటర్ ట్యాంకులను శుభ్ర చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

రామవరప్పాడు: ప్రసాదంపాడు గ్రామంలో సురక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో శనివారం వాటర్ ట్యాంకులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో 90, 40వేల లీటర్ల వాటర్ ట్యాంకులతో పాటు రైవస్, ఏలూరు, బుడమేరు కాల్వగట్ట ప్రాంతాల్లో సుమారు 9 మోటారు బోర్ల సాయంతో తాగునీటిని అందిస్తున్నామన్నారు. నూతన పైప్‌లైన్ల ఏర్పాటు, పాతవి మరమ్మతులు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే వాటర్ ట్యాంకుల లోపల బ్లీచింగ్‌తో ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరాపై సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

మానవత సభ్యుల శాంతి ర్యాలీ



హనుమాన్‌జంక్షన్‌లో మానవత సభ్యుల శాంతి ర్యాలీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమాన్‌జంక్షన్‌లో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్ వద్ద ఎస్ఐ ఏడీఎల్ జనార్ధన్ జెండా ఊపి శాంతి ర్యాలీ ప్రారంభించారు. అధిక సంఖ్యలో మానవత సభ్యులు ర్యాలీకి హాజరై ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జంక్షన్ ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించి, మెయిన్‌సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు.

గ్రామాల్లో ఉపాధి పనులపై ప్రజావేదిక

కె.కొత్తపాలెం(మోపిదేవి): ఉపాధి పనులతో పాటు సామాజిక పింఛన్ల తనిఖీల్లో అనేక అవకతవకలు బయట పడ్డాయి. మండలంలోని కె.కొత్తపాలెం, కొక్కిలిగడ్డ, పెదప్రోలు, బొబ్బర్లంక, మేళ్లమర్తిలంక పంచాయతీ కార్యాలయాల్లో శనివారం ఉపాధి పనుల తనిఖీలపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో పెదప్రోలు గ్రామ సభలో మాట్లాడుతూ ప్రభుత్వ వేతనాలు పొందుతున్న నలుగురు సామాజిక పింఛన్లు కూడా తీసుకుంటున్నట్టు గ్రామ సభ దృష్టికి వచ్చిందని తెలిపారు. టీఏ హరిబాబు నాయక్ మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో కె.కొత్తపాలెం, కొక్కిలిగడ్డ, బొబ్బర్లంకలో జరిగిన గ్రామ సభలో ఉపాధి పనులపై సామజిక తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్లు, హౌసింగ్, ఆర్‌బీకే, సచివాలయలు, హెల్త్ క్లినిక్, సీసీ రోడ్లుపై తనిఖీలు నిర్వహించి గ్రామ సభల్లో చదివి వినిపించామని వివరించారు. కె.కొత్తపాలెంలో 15 మంది బోగస్ సర్టికెట్ల ద్వారా పింఛన్లు పొందుతున్నట్లు, మరికొంత మంది గ్రామంలో లేరని తనిఖీల్లో బయట పడినట్లు తెలిపారు. గ్రామ సభల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



కె.కొత్తపాలెం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎన్ఆర్ఈజీఎస్ ఆడిట్ అధికారులు

పార్కు కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ప్రధాన రహదారిలోని మునిసిపల్ మెయిన్ పార్కులో స్థలదాత మాకర్ల వెంకటస్వామినాయుడు 144వ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. వెంకటస్వామి నాయుడు విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్కులో పనిచేస్తున్న కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు. విగ్రహ కమిటీ అధ్యక్షుడు పిళ్లారిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు వెంకటస్వామినాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంకటస్వామి నాయుడు దానగుణాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాల్సి ఉందన్నారు. పార్కు సూపరింటెండెంట్ రంగబాబు, విగ్రహ కమిటీ ప్రతినిధులు పిళ్లారిశెట్టి సత్యనారాయణ, మాదిరెడ్డి ఆంజనేయులు, ఐనాల రమేష్, పెద్ది బాపూజీ, రావులపాటి శేషగిరి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు స్వీకరించిన పార్కు కార్మికులతో నిర్వాహకులు

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

శ్రీకాకుళం(ఘంటసాల): విద్యార్థులకు జయవాహిని ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని హెచ్‌ఎం బొకినాల కృష్ణ అన్నారు. మండలంలోని శ్రీకాకుళం శివారు సూరపనేనిపాలెం ఎంపీపీ స్కూల్లో జయవాహిని ఫౌండేషన్ చైర్మన్ జయప్రద ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు నోట్ బుక్కు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లను శని వారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జయప్రద మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఫౌండేషన్ ద్వారా సహాయం చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో విద్య, వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనాథ పిల్లల పట్ల ప్రత్యేకశ్రద్ధ చూపుతామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈపూరి వెంకటేశ్వరరావు, కుంపటి కోటేశ్వరరావు, ఈపూరి జోషి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న జయవాహిని ఫౌండేషన్ చైర్మన్ జయప్రద

పాఠశాలల పనితీరు పరిశీలన

పాపవినాశనం(ఘంటసాల): మండలంలోని పాపవినాశనం గ్రామంలోని ఎంపీపీ స్కూల్ (ఆర్), గొల్లపాలెంలోని ఎంపీపీ స్కూల్ (ఏఏ) పాఠశాలలను గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ తమ్మన వేణుగోపాలరావు శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలల రికార్డుల నిర్వాహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఉపాధ్యాయుల పాఠ్యప్రణాళికలు, బోధన ఉపకరణములు ఉపయోగించే విధానం, స్మార్ట్ టీవీలు, ఐఎఫ్ ప్యానల్ బోర్డుల ద్వారా విద్యా బోధన తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలల అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు గొర్రుముచ్చు రజనీకుమారి, పిల్లి రవిబాబు పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కాంప్లెక్స్ చైర్మన్ వేణుగోపాలరావు

బస్సు ఢీకొని యువకుడు మృతి

కంకిపాడు: బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అదనపు ఎస్ఐ తాతాచార్యులు తెలిపిన కథనం మేరకు..మండలంలోని ఈడుపుగల్లు బీసీ కాలనీకి చెందిన షేక్ బాజీ (24) కారు డ్రైవర్. శనివారం రాత్రి గంగూరు నుంచి బిర్యానీ తీసుకుని బైక్‌పై ఈడుపుగల్లు వస్తుండగా మచిలీపట్నం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుకగా ఢీకొంది. దీంతో బాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకుతరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.